క్లుప్తంగా

త్వరితగతిన నాడు-నేడు పనులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో దుర్గారావు

వంగర: ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఈవోలు ప్రవీణ్ ప్రకాష్, దుర్గారావు సూచించారు. శనివారం స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశమైన ఆయన పాఠశాలల వారీగా జరుగుతున్న మనబడి నాడు–నేడు పనుల పురోగతిపై సమీక్షించారు. అనంతరం విద్యార్థుల యూడైస్, విద్యా ప్రమాణాలు, పాఠశాలల అభివృద్ధి ప్రణాళికలపై చర్చించి, పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో ఏఈ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చోడి సాగుపై అవగాహన



చోడి సాగుపై అవగాహన కల్పిస్తున్న ఏవో మురళీకృష్ణ

రేగిడి: మండలంలోని పారంపేట రైతు భరోసా కేంద్రం వద్ద చోడి పంట సాగుపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ మాట్లాడుతూ చోడి సాగుకు మార్కెట్‌లో ఉన్న డిమాండ్, పంట మార్పిడి వల్ల జరిగే నేల సారవంతం వంటి విషయాలను వివరించారు. ఎప్పుడూ ఒకేరకం పంటలు సాగు చేయడం కన్నా పంట మార్పిడి చేస్తే మేలు జరుగుతుందన్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేసుకోవడం ద్వారా మంచి ఆదాయం సంపాదించవచ్చన్నారు.

అక్రమాలపై చర్యలు తీసుకోండి

బొబ్బిలి: స్థానిక ఇందిరమ్మ కాలనీలో జరుగుతున్న అక్రమాలు, ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పొట్నూరు శంకరరావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి, కాలనీని సందర్శించి, పలుచోట్ల ఆక్రమణలు జరుగుతున్న విషయం తెలుసుకున్నారు. మొదటి లేఅవుట్‌లోని 45, 628, 634, 635 సర్వే నంబర్లలో ఖాళీ స్థలాలను విక్రయించేందుకు కొంతమంది ప్రయత్నిస్తున్నారని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన కోరారు.

మానవ హక్కులపై అవగాహన

రాజాం: స్థానిక సెయింట్ ఆన్స్ హాస్పిటల్ వద్ద మానవ హక్కులపై శనివారం అవగాహన కల్పించారు. విలియం మేయర్ స్కిల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జీఎంఆర్ వీఎఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అసోసియేటివ్ మేనేజర్ నాగరాజు మాట్లాడుతూ మానవ హక్కులు తమకు తాము అభివృద్ధి చెందేందుకు ఉపయోగపడతాయని, ఇతరుల వల్ల తమకు ఇబ్బందులు కలిగిన సమయంలో మానవహక్కుల ద్వారా న్యాయం పొందవచ్చన్నారు. ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు బ్యాంకు రుణ సదుపాయాలు ఉన్నాయని, వాటిని ఆర్థిక హక్కులో భాగంగా ఎలా పొందాలి, ఎలా వినియోగించుకోవాలన్న దానిని కూలంకుషంగా వివరించారు. అలాగే మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది భవానీప్రసాద్, శ్రీశక్తి సెంటర్ డైరెక్టర్ సిస్టర్ హిల్డా పాల్గొన్నారు.

108లో గర్భిణి ప్రసవం



108 వాహనంలో క్షేమంగా ఉన్న తల్లీబిడ్డ

రాజాం సిటీ: మండలంలోని బొద్దాం గ్రామానికి చెందిన బట్నాన రాము అనే గర్భిణిని 108 అంబులెన్స్‌లో శనివారం ఆస్పత్రికి తరలిస్తుండగా, ప్రసవించింది. పురిటినొప్పులతో బాధపడుతున్న ఆమెను రాజాంలోని ఆస్పత్రికి తరలించేందుకు 108 వాహనాన్ని కుటుంబ సభ్యులు ఆశ్రయించారు. వెంటనే గ్రామం చేరుకున్న 108 వాహనం గర్భిణిని వాహనంలో ఎక్కించి, రాజాం తరలించే ప్రయత్నం చేశారు. ఇంతలో పురిటినొప్పులు మరింత ఎక్కువ కావడంతో ఈఎంటీ పతివాడ వెంకటరమణ సుఖప్రసవం జరిగేలా వైద్యసేవలు అందించడంతో ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం పైలట్ అరసాడ శంకరరావు వాహనంలో తల్లీబిడ్డలను రాజాం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉండగా, సాయమందించిన 108 సిబ్బందిని రాము బంధువులు అభినందించారు.

వైఎస్సార్ సీపీతోనే అన్ని వర్గాలకు సమన్యాయం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



కోదూరులో మహిళకు ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. శనివారం మండలంలోని కోదూరు గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులైన వారికి పథకాలు అందకపోయినా తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాల ప్రజలు బాగుండాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తపన అని, ఆయన దీనికోసం పాలనలో ఎన్నో సంస్కరణలు తీసుకువస్తున్నారన్నారు. ఆయన ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థల సేవలకు దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉందన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా ప్రజల వద్దకే పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందుతున్నాయని, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే పథకాలు అందుతున్నాయన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీకే దక్కిందన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిన దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. ఓ వైపు అభివృద్ధి పనులు చేపడుతూనే సంక్షేమాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి మన సీఎం జగనన్న అని అన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొబ్బినాయుని వెంకటనాయుడు, పార్టీ సీనియర్ నేత శంబంగి వేణుగోపాలనాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు



రేగిడి: విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యాధికారి అసిరినాయుడు



రేగిడి: వన్నలిలో రోగుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న వైద్యాధికారి సోహినీరాఘవ్

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ అసిరినాయుడు శనివారం ఆరోగ్య తనిఖీలు చేశారు. మొత్తం 275 మంది ఆరోగ్యం పరిశీలించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. ఆరుబయట తినుబండారాలు తినవద్దని, ప్రతిరోజూ రెండు పూటలా స్నానం చేయాలని, ఉతికి, ఆరబెట్టిన దుస్తులను ధరించాలని వైద్యాధికారి విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని వన్నలి గ్రామంలో 104 అంబులెన్స్ ద్వారా శనివారం వైద్యశిబిరం నిర్వహించి, ప్రజలకు ఆరోగ్య తనిఖీలు చేశారు. అవసరమైన వారికి రక్తపరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి సోహినీరాఘవ్ మాట్లాడుతూ ప్రజారోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వారంలో ఒకరోజు గ్రామాని కేటాయించిన రోజు 104 అంబులెన్స్ వస్తుందని, 14 రకాల రోగ నిర్ధారణ పరీక్షలు చేయడంతో పాటు 64 రకాల మందులు అందించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ ప్రియా ఏఎస్ఎం రాజేశ్వరి, సర్పంచ్ రమణ తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీస్కూల్ పిల్లలకు ప్రతినెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించాలని తెర్లాం పీహెచ్‌సీ ఎంఎల్‌హెచ్‌పీ వై.శ్రీదేవి సూచించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రం -5లో చిన్నారులకు శనివారం ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. పిల్లల బరువు, ఎత్తు పరిశీలించడంతో పాటు ఏవైనా అనారోగ్య సమస్యలున్నాయనే విషయం తెలుసుకున్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



తెర్లాం: గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న ఎంపీపీ ఉమాలక్ష్మి

తెర్లాం: గర్భిణులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులకు చేసిన వైద్య తనిఖీలను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గర్భిణులు తప్పనిసరిగా ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవాలు చేయించుకోవాలని, ప్రసవం జరిగేంత వరకు క్రమం తప్పకుండా ఆరోగ్య తనిఖీలు చేయించుకోవాలని సూచించారు. ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. వైద్యుల సలహాలు, సూచనల మేరకు మాత్రమే మందులు వాడాలన్నారు. స్థానికంగా ఉన్న వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు వెళ్లి కూడా వైద్య పరీక్షలు చేసుకోవచ్చన్నారు. అంతకుముందు గర్భిణుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం ఎంపీపీ వారికి వడ్డించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు రెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పశు సంరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యం

- పశువైద్యాధికారులు హిరణ్య, సురేష్



చూడితో ఉన్న పాడి ఆవును పరీక్షిస్తున్న పశు వైద్యాధికారులు హిరణ్య, సురేష్

రామభద్రపురం: పశు సంరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని, నోరులేని మూగజీవాలకు కూడా నాణ్యమైన వైద్యసేవలందేలా చర్యలు తీసుకుంటోందని రామభద్రపురం, ఆరికతోట పశు వైద్యాధికారులు హిరణ్య, సురేష్ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీరామ్‌నగర్ కాలనీల్లోని పలు పశువులను వారు శనివారం పరిశీలించారు. తుఫాన్ ప్రభావంతో పశువులకు సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాడిరైతులకు వివరించారు. సీజనల్ వ్యాధులు సోకకుండా ముందస్తు టీకాలు వేయించాలని సూచించారు. పశువైద్యానికి అవసరమైన మందులు కొరత లేకుండా ప్రభుత్వం చూస్తోందని, పశువులకు ఏవైనా పెద్దపెద్ద వ్యాధులు సోకినప్పుడు వాటిని నిర్ధారించేందుకు నియోజకవర్గానికి ఒకటి చొప్పున వ్యాధి నిర్ధారణ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే దూరప్రాంతాల పాడి రైతులు పశువులను ఆస్పత్రికి నడిపించి, తరలించకుండా సంచార పశువైద్యశాలలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ప్రస్తుతం సత్వరమే పశువులకు వైద్యసేవలందడం ద్వారా గతంలో కన్నా ఇప్పుడు పశు మరణాలు తగ్గాయన్నారు. ఆర్‌బీకేల్లో లభించే గడ్డి విత్తనాలను నాటి, ఆ గడ్డిని పశువులకు వేస్తే పాల దిగుబడి పెరుగుతుందన్నారు.

కార్తీక వనసమారాధన

బాడంగి: మండలంలోని ముగడ, ముగడ కాలనీ, భీమవరం, చినభీమవరం గ్రామాల్లో కార్తీక వనసమారాధనలు శనివారం ఉత్సాహంగా జరిగాయి. చినభీమవరానికి చెందిన కొంతమంది మహిళలు తొలుత సమీపంలోని ఉసిరి చెట్టుకు పూజలు చేసి, శివపార్వతులను కొలిచారు. అనంతరం జరిగిన అన్నదానంలో అందరూ పాల్గొని, భోజనం ఆరగించారు.

కచ్చితమైన ఓటరు జాబితాయే లక్ష్యం

బాడంగి: రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా కచ్చితమైన ఓటరు జాబితా రూపొందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ అజురఫీజాన్ అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ఓటర్ల జాబితా ముసాయిదా ప్రకారం ఇంటింటికీ బీఎల్‌వోలు వెళ్లి, ఓటరు జాబితాలోని ఓట్లను నిశితంగా పరిశీలించడం జరిగిందన్నారు. ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉన్నవారు 960 మందిగా గుర్తించామన్నారు. ఇటువంటి ఓట్లలో ఓ చోట ఓటరు అభిప్రాయం మేరకు తొలగించడం జరుగుతోందన్నారు.

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. సహిత విద్య శిక్షకులు కృష్ణమోహన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈవోలు చల్ల లక్ష్మణరావు, గొట్టాపు వాసు పాల్గొని, దివ్యాంగులను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న తీరు, దివ్యాంగుల అభివృద్ధి, సంక్షేమం కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం పలువురు దివ్యాంగులను సత్కరించారు.

నేడు ఘంటసాల పాటల ఆలాపన

బొబ్బిలి: స్థానిక శ్రీకళాభారతి మున్సిపల్ ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు ఘంటసాల పాటల ఆలాపన నిర్వహిస్తున్నట్లు యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ అధ్యక్షుడు మింది విజయమోహనరావు ఓ ప్రకటనలో శనివారం వెల్లడించారు. పాటల దేవుడు ఘంటసాల జయంతి ఉత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని కోరారు.

40 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని మేదరిబంద జంక్షన్ వద్ద వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 40 బస్తాల బియ్యం పట్టుకుని, వాహనాన్ని సీజ్ చేశామని ఎస్‌ఐ సత్యనారాయణ శనివారం తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి, గొల్లపల్లి అజయ్, కేతల ధనుంజయ్‌లను అదుపులోకి తీసుకుని, విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

రాజాం సిటీ: స్థానిక తెలగవీధిలో నివాసముంటున్న 17 ఏళ్ల బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేశామని సీఐ కె.రవికుమార్ శనివారం తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా, బలిజిపేట మండలం, శ్రీరంగరాజపురానికి చెందిన కోనారి దుర్గారావు కుటుంబంతో కలిసి కొన్నేళ్ల క్రితం బతుకు తెరువు కోసం విజయవాడ వెళ్లాడు. అక్కడ ఆర్థిక పరిస్థితులు బాగోలేకపోవడంతో ఇటీవల రాజాం వచ్చి, తెలగవీధిలోని ఓ ఇంట్లో అద్దెకు నివాసముంటున్నాడు. ఈ నెల 8వ తేదీ మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకువెళ్లిన ఆయన కుమార్తె తిరిగి రాకపోవడంతో అన్నిచోట్ల వెతికారు. ప్రయోజనం లేకపోవడంతో తల్లి నాగమణి ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబు

రాజాం సిటీ: లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయంతో పాటు సకాలంలో కేసుల పరిష్కారం జరుగుతోందని రాజాం సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎమ్.బాబు అన్నారు. స్థానిక కోర్టు సముదాయంలో న్యాయవిజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పు అని, లోక్ అదాలత్‌లో సివిల్ కేసుల పరిష్కారంతో పాటు చట్టరీత్యా రాజీకి అనుకూలమైన క్రిమినల్ కేసులు కూడా ఇరుపార్టీల అంగీకారంతో పరిష్కరించడం జరుగుతుందన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కారమైన సివిల్ కేసులకు సంబంధించి, కోర్టు ఫీజు కూడా వాపసు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాజాం జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ, రాజాం బార్ అసోసియేషన్ మాజీ ప్రెసిడెంట్ కె.రమణమూర్తి, గవర్నమెంట్ ప్లీడర్ ఎస్.పోలారావు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 590 కేసుల పరిష్కారం

స్థానిక కోర్టు సముదాయంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 590 కేసులు పరిష్కరించారు. సీనియర్ సివిల్ జడ్జి ఎమ్.బాబు అధ్యక్షతన ఒకటి, జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ అధ్యక్షతన మరొక బెంచ్ ఏర్పాటు చేసి, కేసులు పరిష్కరించారు. మొత్తం రూ.53,00,270 నగదుకు సంబంధించి, కేసులు కూడా ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి తెలిపారు. వీటిలో సివిల్ కేసులు 11 ఉండగా, క్రిమినల్ కేసులు 509 ఉన్నాయని, సారా కేసులు 58, భార్యాభర్తల తగాదాలు 10, బ్యాంకు పీఎల్‌సీలు 2 ఉన్నాయన్నారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ న్యాయవాద సభ్యులు జి.తవుడు, బి.సన్యాసి, బార్ అసోసియేషన్ మాజీ ప్రెసిడెంట్ కె.రమణమూర్తి, వైస్ ప్రెసిడెంట్ డి.భవానీప్రసాద్, ఏపీపీ కిమిడి సూర్యకుమార్, ప్రభుత్వ న్యాయవాది ఎస్.పోలారావు, సీనియర్ న్యాయవాది రెడ్డి రామమూర్తి, రాజాం టౌన్ సీఐ కె.రవికుమార్, ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: స్థానిక కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 134 కేసులు పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి టి.వాసుదేవన్ తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి ఎం.సరోజనమ్మ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జె.సౌమ్యా జోసెఫిన్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శర్మ, దామోదరరావు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

- ఎమ్మెల్యే కంబాల జోగులు



రామానుజులపేటలో తుఫాన్ వర్షాలకు పాడైన వరి పనలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: మిచాంగ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండలంలోని రామానుజులపేట గ్రామ పరిసర ప్రాంతాల్లో తుఫాన్ వర్షాలకు దెబ్బతిన్న వరి పంటపొలాలను ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన రైతులు దువ్వ లోకేశ్వరరావు, దువ్వ రాఘవరావు, దువ్వ నాగరాజు తదితరుల వద్ద వివరాలు సేకరించారు. తుఫాన్ వర్షాల కన్నా వర్షాల అనంతరం సాగునీటి కాలువలు, చెరువుల ద్వారా వచ్చిన వరదనీరు పొలాల్లోకి చేరడంతో పంట నష్టం ఏర్పడినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయాధికారులు, మీరు పరిశీలించి, తమకు న్యాయం జరిగేలా చూడాలని ఎమ్మెల్యేను రైతులు కోరారు. స్పందించిన ఎమ్మెల్యే తప్పకుండా న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. వ్యవసాయాధికారులకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని, వారు పాడైన పంటలను పరిశీలించి, నివేదిక అందజేస్తారన్నారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే పర్యటించారని, వారు సేకరించిన వివరాలతో నివేదికలు తయారు చేస్తున్నారన్నారు. వీటన్నింటికీ ప్రభుత్వానికి తెలిపి, నష్టపరిహారం అందజేలా చూస్తామన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ బండి నర్సింహులు, రాజాం పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు తదితరులు ఉన్నారు.

జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలి



బొబ్బిలి: వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా బొబ్బిలి పట్టణంలోని 16వ వార్డులో రాత్రిబస చేస్తున్న కౌన్సిలర్ రామకృష్ణ తదితరులు



రాజాం: రాజయ్యపేటలో ఇంటింటికీ వెళ్లి, సంక్షేమ పాలనను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాజగోపాలనాయుడు, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరావు



బొబ్బిలి: పాతబొబ్బిలిలో ప్రచారంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు రమేష్‌నాయుడు, కౌన్సిలర్ పెదరాములు తదితరులు

వై ఏపీ నీడ్స్ జగన్(ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి) కార్యక్రమంతో జై జగన్, జై వైఎస్సార్ సీపీ నినాదాలు మిన్నంటుతున్నాయి. ప్రభుత్వం చేసిన మేలును వివరించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో శనివారం ఇంటింటికీ పార్టీ నేతలు వెళ్లి, నాలుగున్నరేళ్లుగా జగనన్న ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. సచివాలయాల వద్ద ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డులు, పార్టీ జెండాలు ఆవిష్కరించారు. గతంలోని టీడీపీ పాలనకు, ప్రస్తుత వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న తేడాను గమనించాలని, మేలు జరిందంటేనే వచ్చే ఎన్నికల్లో ఓటు వేసి, పార్టీని గెలిపించాలని కోరారు. ఏ ఇంటికి వెళ్లినా, ఎవరినడిగినా జగనన్నే మళ్లీ మళ్లీ సీఎం కావాలని జనం కోరుకుంటుండడం పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నింపుతుండడం విశేషం. –సాక్షి నెట్‌వర్క్.

గణిత పోటీల విజేతలు వీరే..



బహుమతులతో విద్యార్థులు

రేగిడి: మండలంలోని సంకిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన మండల స్థాయి గణిత క్విజ్ పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి పురస్కరించుకుని, ఈ పోటీలు నిర్వహించినట్లు ఏపీఎంఎఫ్, సిక్కోలు గణిత ఉపాధ్యాయ సంఘాలు తెలిపాయి. సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించగా, సీనియర్స్ విభాగంలో ప్రథమ స్థానంలో లక్ష్మీపేట జెడ్పీ ఉన్నత పాఠశాల, ద్వితీయ స్థానంలో సంకిలి జెడ్పీ ఉన్నత పాఠశాల, తృతీయ స్థానంలో కందిశ పాఠశాల విద్యార్థులు నిలిచారని, జూనియర్స్ విభాగంలో ప్రథమ స్థానంలో లక్ష్మీపురం జెడ్పీ ఉన్నత పాఠశాల, ద్వితీయ స్థానంలో రేగిడి జెడ్పీ ఉన్నత పాఠశాల, తృతీయ స్థానంలో ఏవీ పురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిలిచి, బహుమతులు కైవసం చేసుకున్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలను గణిత ఉపాధ్యాయులు కొత్తకోట కృష్ణంరాజు, మురహరి, సూరిబాబు, హరిబాబు, రమణ, హుస్సేన్ తదితరులు పర్యవేక్షించారు.

సంతకవిటి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి గణిత క్విజ్ పోటీలు శనివారం నిర్వహించారు. జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా ఏపీఎంఎఫ్, సిక్కోలు గణిత ఉపాధ్యాయ వేదిక ఆధ్వర్యంలో ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థుల వరకు ఈ పోటీలు నిర్వహించగా, విజేతలకు ఎంఈవో భాస్కరరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సాయిశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వంగర: జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏపీఎంఎఫ్, సిక్కోలు గణిత ఉపాధ్యాయ వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి గణిత క్విజ్ పోటీలు శనివారం నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ముద్దాడ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

రాజాం: స్థానిక పట్టణ పరిధిలోని డోలపేట గ్రామంలో కొత్తగా నిర్మించిన కనకదుర్గమ్మ ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. డోలపేట వాసులతో పాటు పరిసర గ్రామాల భక్తులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

రాజాం: కార్తీక ద్వాదశి పురస్కరించుకుని, పట్టణంలోని సత్యనారాయణపురం తెలగ వీధిలో ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ప్రధానార్చకులు భట్టరు శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో ప్రత్యేకార్చనలు శనివారం చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెలికాన బదిరీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: భగవాన్ శ్రీసత్యసాయిబాబా నామాన్ని నిరంతరం స్మరించుకుంటే జీవితం సన్మార్గంలో పయనిస్తుందని కవి, పండితుడు గుత్తి నర్సింహమాస్టారు అన్నారు. స్థానిక విశ్వసాయి మందిరంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం, సాయంత్రం వేళల్లో ఆలయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటే మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు.

రబీ సాగుకు మడ్డువలస ప్రాజెక్ట్ నీరు ఇవ్వాలి

- జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెంకటేశ్వరరావు

రేగిడి: రబీ సీజన్‌లో రైతులు సాగుచేసే ఆరుతడి పంటలకు మడ్డువలస ప్రాజెక్ట్ నుంచి పూర్తిస్థాయిలో సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు సూచించారు. మండలంలోని ఉనుకూరు గ్రామంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు వరికోతలు పూర్తి చేసి, మొక్కజొన్న పంటను పొలాల్లో సాగుచేస్తున్నారని, అయితే మిచాంగ్ తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు మొక్కజొన్న విత్తనాలు మొలకెత్తలేదన్నారు. ఈ క్రమంలో రైతులు మళ్లీ మొక్కజొన్న విత్తనాలు పొలాల్లో వేసేందుకు సన్నద్ధమవుతున్నారని, అవసరమైన సాగునీటిని మడ్డువలస కాలువల ద్వారా అందించాలన్నారు. ప్రస్తుతం మడ్డువలస ప్రాజెక్ట్‌లోని నీరు కూడా ఇన్‌ఫ్లో ఉండగా, ఆ నీటిని వృథాగా నాగావళి నదిలోకి విడిచిపెట్టేస్తున్నారని, అలా కాకుండా ఆ నీటిని ప్రాజెక్ట్‌లో నిల్వ ఉంచి, రబీలో ఆయకట్టు రైతులకు సాగునీరు అందేలా చూడాలన్నారు. దీనిపై అధికారులు ఆలోచించి, పత్రికా ప్రకటన ద్వారా సాగునీరు అందిస్తున్నట్లు ఓ ప్రకటన ఇవ్వాలని కోరారు.

10 మద్యం సీసాల స్వాధీనం

మెంటాడ: మండలంలోని పోరాం గ్రామంలో ఓ వ్యక్తి వద్ద అక్రమంగా నిల్వ ఉన్న 10 మద్యంసీసాలను పట్టుకుని, స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ అప్పారావు శనివారం తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి, గ్రామానికి చెందిన పాండ్రంకి చిట్టిబాబు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశామన్నారు.